సంక్షేమ పథకాలతో బీఆర్ఎస్‌కు ఆదరణ


నందకిశోర్ వ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిన పలు పార్టీల నేతలు

అబిడ్స్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రగతితో పలు పార్టీల నేతలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ నంద కిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రభుత్వ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో నందకిశోర్ ఆధ్వర్యంలో చేశారు. ఈ సందర్భంగా నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సహకారంతో గోషామహల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగరవేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పప్పుమాత్రే, విష్ణువర్ధన్, జగదీష్, అనూప్, సాహిల్, అనిల్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఉత్తమ కుమార్‌రెడ్డికి అభినందనలు



అబిడ్స్: ఆల్ ఇండియా కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యుడిగా నియమితులైన క్యాప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి అభినందనలు తెలిపిన టీపీసీసీ అధికార ప్రతినిధిగౌరీ సతీష్, టీపీసీసీ కార్యవర్గ సభ్యులు షాబాద్ దర్శన్.

శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్



రాజేంద్రనగర్: శంషాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా దేవేందర్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాస్‌ను బదిలీ చేయడంతో దేవేందర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని స్టేషన్ ఆవరణలో 'సాక్షి'తో మాట్లాడుతూ ప్రజలు ఎక్సైజ్ పోలీసులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. తమ ప్రాంతంలో మత్తు పదార్థాలు ఎవరైనా విక్రయిస్తున్న వారి సమాచారాన్ని అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

బీజేపీ రాజేంద్రనగర్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి


దరఖాస్తును అందజేస్తున్న బీజేపీ నాయకుడు సోల్కర్‌రెడ్డి

రాజేంద్రనగర్: బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థిగా అవకాశం కల్పించాలంటూ బీజేపీ నాయకుడు సోల్కర్‌రెడ్డి సోమవారం దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఎంసీఏ చదివిన తాను ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 2009 నుంచి 2014 వరకు లోక్‌సత్తా పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశానన్నారు. రాజకీయంలో 20 ఏళ్ల అనుభవం ఉందని వెల్లడించారు. బీజేపీకి ఆకర్షితులై పార్టీలో చేరానన్నారు. పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తు నియోజకవర్గంలో అందుబాటులో ఉన్నానన్నారు.

నేడు 'మనూ'లో 'అందరికీ విద్య'

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఈ అండ్‌టీ) ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా 'అందరికీ విద్య' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం జరుగుతుందని ఎస్ఈ అండ్ టీ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు.. మంగళవారం ఉదయం 11 గంటలకు క్యాంపస్‌లోని డీడీఈ ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం కూడా జరుగుతుందన్నారు.

25 మంది విద్యార్థులు ఎంపిక

రాయదుర్గం: మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్‌తో ఫ్యాక్ట్‌సెట్ కంపెనీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధికారులు సోమవారం సమావేశమయ్యారు.సంస్థ అధికారులు వెంకట సత్యకృష్ణ, మహేష్‌లు వీసీకి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జీ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ పర్యవేక్షణలో కంప్యూటర్ ఆధారిత హ్యాకర్ ర్యాంక్ టెస్ట్ అసెస్‌మెంట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ఎంబీఏ, ఎంకామ్, బీకామ్ విద్యార్థులు హాజరయ్యారు.ప్రతిభ చాటిన వారిలో 25 మందిని ఎంపిక చేశారు.

ఘనంగా కాటమయ్యస్వామి బోనాలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలో శ్రావణమాస బోనాల వేడుకలను కాటమయ్య స్వామి ఆలయం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించారు. కాటమయ్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ దేవాలయం నుంచి తొట్టెలు ఊరేగింపుగా వచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం మహిళలు బోనాలను సమర్పించారు. ఈ వేడుకల్లో పోతురాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాటమయ్య యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై ఆగి ఉన్న కారును మరో కారు ఢీకొట్టడంతో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డరు. శంషాబాద్ నుంచి మెహిదీపట్నం వైపు వెళ్తున్న ఓ కారు పిల్లర్ నెం:130 వద్ద ఆదివారం రాత్రి పక్కన ఆపారు. వెనుకాలే వేగంగా వచ్చిన మరో కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. కారులో ఉన్న ఇద్దరు గాయపడడంతో స్థానిక ఆస్పత్రికి తరలించారు. సోమవారం సాయంత్రం వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్రబాబు తెలిపారు.

మాణిక్ రావు ఠాక్రే, మధుయాష్కీని కలిసిన వెంకటేశ్



చార్మినార్: ఏఐసీసీ సెక్రటరీ, కాంగ్రెస్ పార్టీ రాష్ట వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రే, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వెంకటేశ్ గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం గాంధీభవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్‌పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన మాణిక్ రావు ఠాక్రే, మధుయాష్కీ గౌడ్‌ను వెంకటేశ్ కలిసి రాబోయే శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నానని తెలిపారు. తన దరఖాస్తును పరిశీలించి పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తున్న తనకు పార్టీ టికెట్‌ను కేటాయించాలని వెంకటేశ్ వారిని కోరారు.

కవయిత్రి సుష్మకు ప్రతిభా పురస్కారం



అబిడ్స్: కుసుమ ధర్మన్న యువ సాహిత్య పురస్కారానికి కవయిత్రి పి.సుష్మ ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన సాహిత్య ప్రతిభా పురస్కారాల ఎంపికలో కొన్ని సంవత్సరాలుగా తన కవితలతో రాణిస్తున్న పి.సుష్మకు ఈ జాతీయ పురస్కారం దక్కింది. ఈనెల 8న రవీంద్రభారతిలో పలువురు ప్రముఖుల సమక్షంలో గండపెండేరం, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ఘనంగా సత్కరిస్తామని నిర్వాహకులు రాధా కుసుమ తెలిపారు. ఈ సందర్భంగా కవయిత్రి పి.సుష్మ మాట్లాడుతూ..జాతీయ స్థాయిలో తనకు ఉత్తమ ప్రతిభా అవార్డు లభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మరింత రెట్టింపు ఉత్సాహంతో తన కవితలతో అందరిని మంత్రముగ్ధులను చేస్తానన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేస్తా


శ్రీ పాండురంగ ముతాలిక్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: రామ్‌కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రముఖ సితార్ విద్వాంసులు శ్రీ పాండురంగ ముతాలిక్ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. తాను 1982లో సితార్ విద్యను శ్రీ బాపూజీ వ్యాంసుందర్ గురువు వద్ద ఇదే కళాశాలలో నేర్చుకున్నానని తెలిపారు. 21 ఏళ్ల పాటు భక్తరాందాస్ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల సికింద్రాబాద్‌లో పనిచేశానన్నారు. 2019లో మంథని ప్రభుత్వ మ్యూజిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించినట్లు తెలిపారు. తాను నేర్చుకున్న సంగీత కళాశాలకే ప్రిన్సిపాల్‌గా రావడం ఆనందం కలిగించిందన్నారు. విద్యార్థులు వివిధ సంగీత కోర్సుల్లో చేరి సంగీతం, నృత్యం నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఆచార్య మధుకర్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



విజయనగర్‌కాలనీ: జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో డైరెక్టర్ అండ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా పనిచేస్తున్న ఆచార్య గంధ్ర మధుకర్‌ను ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ.. అవార్డులు ఉత్తేజాన్ని ఇచ్చి మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేలా చేస్తాయన్నారు. సోమవారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కవిత దరియానిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్‌కుమార్, బోధన, బోధనేతర అధికారులు, సిబ్బంది ఆచార్య మధుకర్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి


కిక్‌బాక్సింగ్ పోటీను ప్రారంభిస్తున్న ఆశీష్‌కుమార్‌యాదవ్

అబిడ్స్: క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా తెలంగాణ రాష్ట ప్రభుత్వం కృషి చేస్తుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఆశీష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఎల్బీస్టేడియంలో కిక్‌బాక్సింగ్ క్రీడా పోటీల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, ఆత్మరక్షణకు ఎంతో దోహదపడుతాయన్నారు. ప్రతి ఒక్కరికి చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో క్రీడాకారులకు అన్నివిధాలుగా అండదండాలు అందిస్తున్నామని ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

7, 8 తేదీల్లో పూసల బస్తీలో శ్రీకృష్ణ జన్మాష్టమి

అబిడ్స్: ఈనెల 7, 8వ తేదీలలో 71వ శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు మంగళ్‌హాట్ పూసలబస్తీలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వాస్తుశిల్పి, ఆర్కిటెక్ ఇంజినీర్ ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణలు తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వైభవంగా వేడుకలు నిర్వహిస్తామన్నారు. దివంగత పొదిలి వెంకన్న, పొదిలి బూషమ్మ ఆశీస్సులతో వేడుకలు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన గురువారం తెల్లవారుజామున స్వామివారి అభిషేకంతో వేడుకలు ప్రారంభమై అదేరోజు మధ్యాహ్నం హవనం, సాయంత్రం భజన కీర్తనలు, రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ డోలారోహణం ఉంటుందన్నారు. 8వతేదీ ఉదయం 11 గంటలకు సత్యనారాయణ స్వామి వ్రతం, మధ్యాహ్నం అన్న ప్రసాదం, సాయంత్రం బాలబాలికలకు శ్రీకృష్ణ, యశోద, రాధ, గొల్లభామల వేషధారణ పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం 6 గంటలకు ఉట్ల కార్యక్రమం చేపడుతామని ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ వెల్లడించారు. విజేతలకు బహుమతులు ఇస్తామని తెలిపారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: భవిష్యత్ తరాలకు ఉపయోగకరమైన రచనలను అందించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. ఆ బాధ్యత రచయితలదేనని సూచించారు. సోమవారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత తిరుమల వెంకటస్వామి రచించిన బాలగేయాలు, సీహెచ్ నటరాజరావు రచించిన భూ విలాపం పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశభక్తి, దైవభక్తి కలిగిన రచనలను చేయాలన్నారు. భూ విలాపం, బాల గేయాలు పుస్తకాలు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, రచయిత ఎస్వీ రామారావు, సుధామ, సంస్థ అధ్యక్షులు రాంచంద్రారావు, కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ డ్రైవర్‌కు సన్మానం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 25 ఏళ్లగా సేవలు అందిస్తున్న రాజు బెస్ట్ డ్రైవర్‌గా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు వివిధ సంఘాల సభ్యులు సోమవారం ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. రాజు మాట్లాడుతూ.. యూనివర్సిటీ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అవార్డును అందించారన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహమాదిగ, మద్దిలేటి మాదిగ, మంగళారం రత్నంమాదిగ, నాన్నగారి రామచంద్రమాదిగ, యాదగిరిమాదిగ, కొండా లక్ష్మణ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ పోతురాజు యాదయ్యమాదిగ పాల్గొన్నారు.

రామ్‌చందర్‌రావు త్యాగాలు స్ఫూర్తిదాయకం


రామ్‌చందర్‌రావు కుటుంబసభ్యులను సన్మానిస్తున్న కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: స్వాతంత్ర్య సమరయోధుడు వందేమాతరం రామ్‌చందర్‌రావు త్యాగాలు స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. సోమవారం మేరి మట్టీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా గోషామహల్‌లోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం వారి వద్ద నుంచి మట్టిని సేకరించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



సంతోష్‌నగర్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గతనెల 31న ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 40–45 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి ఈనెల 1న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నాడు.

లోతట్టు ప్రాంతాల్లో ఉపకమిషనర్ పర్యటన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో ఉపకమిషనర్ రవికుమార్ సోమవారం ఉదయం పర్యటించారు. ప్రధానంగా వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై వరద నీరు నిలిచి ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక టీంలతో వరద నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. దీంతో ఉప్పర్‌పల్లి, శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ, ఆరాంఘర్ చౌరస్తా, రాజేంద్రనగర్, బుద్వేల్, శివరాంపల్లి ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై నిల్వ ఉండకుండా వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి ఉదయం నుంచి జీహెచ్ఎంసీ సిబ్బంది పారిశుద్ధ్య విభాగంతో పాటు మాన్‌సూన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం


లబ్ధిదారుడికి మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం నానల్ నగర్ డివిజన్ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో కార్వాన్, గోల్కొండ, లంగర్‌హౌజ్ డివిజన్లకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుదీర్ఘ కాలంగా అనారోగ్యంగా ఉండి అవసరమైన శస్త్రచికిత్సలు చేసుకునే వారు సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తుతో పాటు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఆస్పత్రి కొటేషన్‌తో పాటు వైద్యుల ప్రిస్క్రిప్షన్‌ను కూడా జత చేయాలన్నారు. పేద, బడుగు వర్గాల ప్రజలకు మజ్లిస్ అండా ఎప్పుడూ ఉంటుందని ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారికి అవి మంజూరయ్యేలా తమవంతు కృషి చేస్తామని ఆయన అన్నారు.

పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పండగలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. సోమవారం గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో పీస్ అండ్ మైత్రి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండగలు వివిధ వర్గాల ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతాయన్నారు. మొహర్రం, వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ, దేవీ శరన్నవరాత్రి తదితర ఉత్సవాలు అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సాహంగా జరుపుకుంటారని ఆయన అన్నారు. స్థానిక ఉత్సవాల్లో సైతం శాంతిభద్రతలను కాపాడడానికి మైత్రి కమిటీ సభ్యులు పోలీసులకు సహకరిస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మిత్రకృష్ణకు జియాగూడ మాదిగ సేవా సంఘం మద్దతు


మిత్రకృష్ణను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మిత్రకృష్ణకు జియాగూడ మాదిగ సేవా సంఘం తమ పూర్తి మద్దతును ప్రకటిస్తుందని సంఘం అధ్యక్షుడు రాములు (నర్సింహ) అన్నారు. సోమవారం జియాగూడకు చెందిన మాదిగ సేవా సంఘం సభ్యులు మిత్రకృష్ణను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గం నుంచి దళితుడినైన తనకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు పి.చెన్నయ్య, కోశాధికారి మొగులయ్య, ఎం.రామ్, దాసు తదితరులు పాల్గొన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఓటరు నమోదు

గోల్కొండ: ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ఎంతో ప్రాముఖ్యతతో కూడుకున్నదని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేర్లు లేని వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోన్నకుంటి మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం దృశ్యం

సగర కులస్తుల అభ్యున్నతికి కృషి


సాగర్ సంఘం నాయకులను సన్మానిస్తున్న దేవర వంశీ తదితరులు

గోల్కొండ: సగర కులస్తుల అభ్యున్నతికి కృషి చేస్తామని కార్వాన్ సగర సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన అధ్యక్షుడు శ్రీధర్‌సాగర్ అన్నారు. సోమవారం గుడిమల్కాపూర్‌లో కార్వాన్ సాగర్ సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా శ్రీధర్‌సాగర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సగర కులస్తుల ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి అందరితో కలిసి పని చేస్తానన్నారు. రాజకీయంగా సగర్ కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నదే తమ ప్రధాన ఆశయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖేష్‌సాగర్, వేణుగోపాల్‌సాగర్, బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులున్నారు.

'కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోంది'


కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

గోల్కొండ: రాష్ట్రంలో రోజురోజుకూ కాంగ్రెస్ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోందని ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఎస్.ఉషశ్రీ అన్నారు. సోమవారం ఆమె ఆధ్వర్యంలో కార్వాన్‌లో ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికులను కలుసుకోని కాంగ్రెస్ సాధించిన విజయాలతో పాటు తెలంగాణను కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలన వల్లే దేశం శాస్త్ర సాంకేతిక రంగాలతో పాటు బలియమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నిబేగం, షాకెల్లా, కృష్ణ, చంటిబాబు తదితరులున్నారు.

టప్పాచబుత్ర పీఎస్ పరిధిలో చబుత్ర ఆపరేషన్


కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్

విజయనగర్‌కాలనీ: అర్ధరాత్రి వేళ అనవసరంగా అరుగలమీద ముచ్చటిస్తూ కాలక్షేపం చేయొద్దని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ సూచించారు. ఆదివారం అర్ధరాత్రి, సోమవారం తెల్లవారుజాము వరకు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో చబుత్ర ఆపరేషన్ నిర్వహించి 34 మంది యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారి కటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. పనీపాటాలేని వారు మాత్రమే అర్ధరాత్రి రోడ్లపై సంచరిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతుంటారని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు, పెట్రోకార్, బ్లూకోర్ట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.